

నేడు ఎర్రన్న విద్యాసంకల్పం మాక్ టెస్టు

శ్రీకాకుళం: ఎర్రన్న విద్యా సంకల్పం కార్యక్రమంలో భాగంగా డిఎస్సి ఎస్జిటి అభ్యర్థులకు, కానిస్టేబుల్ మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు కంప్యూటర్ ఆధారిత, ఆఫ్‌లైన్ మాక్ టెస్టులు ఈనెల 18వ తేదీన నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఉమెన్స్ కాలేజ్ రోడ్డులోని కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఉదయం పది గంటలకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మాక్ టెస్టులు రాయాలనుకునే అభ్యర్థులు ఈ లింకును ఉపయోగించుకొని WWW.YVSSRIKAKULAM.LIVE మాక్ టెస్టులు రాయడానికి రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు. రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మాక్ టెస్టు వాస్తవిక పరీక్ష వాతావరణానికి అనుభవం కలిగిస్తుందని పేర్కొన్నారు.

'ఆపరేషన్ సిందూర్'తో సత్తా చూపించాం

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు



తిరంగా ర్యాలీలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఆపరేషన్ సిందూర్‌తో శత్రువుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక కొత్తమ్మతల్లి ఆలయం నుంచి రైతుబజారు వరకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, వందలాదిమంది ప్రజలతో కలిసి తిరంగ యాత్రను శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇదో ప్రజా ఉద్యమం, మన ఆడబిడ్డల కుంకుమ చెరిపేసిన వాళ్లపై ఆపరేషన్ సిందూర్‌తో ప్రతీకారం తీర్చుకున్నామని అన్నారు. తీవ్రవాదులందరికీ ఇదో హెచ్చరికని, దేశంలోకి ఏ తీవ్రవాది అడుగుపెట్టినా వారికి అదే చివరి రోజు అని అన్నారు. ఉగ్రమూకలు ప్రపంచంలో ఏ మూల దాక్కున్నా వారికి అంతం చేయాలన్నదే ప్రధాని సంకల్పం అని అన్నారు. ప్రధాని సంసంకల్పానికి మనమంతా సంపూర్ణ మద్దతు ఇద్దామన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణాలు కోల్పోయిన మురళీనాయక్‌కు జోహార్లు అని, తన త్యాగంతో చిరంజీవిగా మిగిలిపోయిన అమరజీవి మురళీనాయక్‌యని అన్నారు. అతడి స్ఫూర్తిని మనం ఎప్పటికీ గుర్తుపెట్టుకుందామన్నారు.

మనల్ని, దేశాన్ని కాపాడేందుకు ప్రాణాలు అర్పిస్తున్న జవాన్లు అందరికీ చేతులెత్తి నమస్కరిస్తున్నామన్నారు. వాళ్ల పోరాటం వల్లే మనం క్షేమంగా ఉంటున్నామని, మన దేశ గౌరవం, బలం, బలగం మన సాయుధ దళాలే అని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకుడు బోయిన గోవిందరాజులు, రమేష్, విజయలక్ష్మి, కామేశ్వరరావు, నంబాళ శ్రీనివాస్, ఎల్.ఎల్.నాయుడు, బగాది శేషు, జనసేన నాయకులు కణితి కిరణ్ పాల్గొన్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


క్వారీ ప్రమాద ఘటనపై నిజ నిర్ధారణ

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలంలోని దబ్బగూడలో గల విఆర్‌పి గ్రానైట్ క్వారీలో గురువారం సంభవించిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతి చెందిన ఘటనపై జిల్లా యంత్రాంగం స్పందించింది. ఈ ఘటనపై విచారణ చేసేందుకు అధికారులతో నిజ నిర్ధారణ కమిటీని కలెక్టర్ ఏర్పాటు చేశారు. కమిటీలో టెక్కలి ఆర్‌డిఒ, డిఎస్‌పి, మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా అగ్నిమాపక అధికారి, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఉన్నారు. ఈ కమిటీతో పాటు కలెక్టర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. ప్రమాదానికి పిడుగుపాటే కారణమా?, క్వారీలో జరిగిన బ్లాస్టింగ్ వల్లే ప్రమాదం సంభవించిందా? అనే విషయంపై అధికారులు విచారణ చేపట్టారు. పరిశీలన అనంతరం కమిటీ నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వపరంగా అందాల్సిన సాయంతో పాటు క్వారీ యాజమాన్యం నుంచి రావాల్సిన వాటిని అందించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

సురక్షిత ప్రయాణానికి 'సురక్ష' యాప్

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి



మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆటో డ్రైవర్లు, ప్రయాణికుల సురక్షితమైన ప్రయాణానికి సురక్ష క్యూఆర్ కోడ్ యాప్ దోహదపడుతుందని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు, మహిళలు, విద్యార్థుల భద్రత దృష్ట్యా ట్రాఫిక్ నియంత్రణ, ఆటోలో ప్రయాణించే ప్రయాణికులు, చోదకుల భద్రతకు తీసుకొచ్చిన ఈ యాప్‌ను స్థానిక అంబేద్కర్ ఆడిటోరియంలో ఎస్‌పి శనివారం ప్రారంభించారు. అనంతరం కోడి రామ్మూర్తి స్టేడియంలో ఆటోలకు క్యూఆర్ కోడ్ స్కాన్ యాప్ స్టిక్కర్లని అతికించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సురక్ష క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఆటో డ్రైవర్, ఓనర్ వివరాలు, ఆటో ప్రయాణించే దిశ, రోడ్డు మార్గం, లొకేషన్ తదితర పూర్తి వివరాలను తెలుసుకోవచ్చన్నారు. ఈ యాప్ ప్రజలకు అందుబాటులోకి తీసుకెళ్లేందుకు డ్రైవర్లు సహకరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రత కోసం తీసుకొచ్చిన శక్తి యాప్‌తో సురక్ష యాప్‌ను రానున్న రోజుల్లో అనుసంధానం చేస్తామని తెలిపారు. ఆటో యాజమానులు విధిగా కేటాయించిన ఆటో స్టాండ్, పార్కింగ్ ప్రదేశాల్లో ఆటోలు పార్కింగ్ చేసి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరించాలన్నారు. అనంతరం సురక్ష యాప్‌ను రూపకల్పన చేసిన ఐటి కోర్ ఎఎస్‌ఐ బి.రమేష్, ఉత్తమ ఆటో డ్రైవర్లు భాస్కరరావు, శ్రీనివాసరావును అభినందించి జ్ఞాపికలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ విజయసారథి, అదనపు ఎస్‌పి కె.వి రమణ, డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, ఎంవిఐ గంగాధర్, సిఐలు పైడిపు నాయడు, ఇమ్మనుల్ రాజు, ఈశ్వరరావు, అవతారం పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

భూ ఆక్రమణదారులపై చర్యలు

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - పొందూరు

ప్రభుత్వ భూములు, గెడ్డ పోరంబోకులు, చెరువులు, వాగులను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ ఆర్.వెంకటేష్‌ను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. మండలంలోని తండ్యాం పంచాయతీ బొట్లపేట గ్రామ పరిధిలోని సర్వే నంబరు 5లో వీర మరణం పొందిన జవాను సింగూరు విష్ణుమూర్తి కుటుంబానికి కేటాయిస్తున్న స్థలాన్ని శనివారం పరిశీలించారు. ఆపరేషన్ బ్లూస్టార్‌లో తోలాపికి చెందిన విష్ణుమూర్తి సతీమణి శాంతకు తోలాపిలో 2.5 ఎకరాల స్థలం కేటాయించారు. చెరువు గర్భంలో కేటాయించడంతో 2022లో దీన్ని రద్దు చేశారు. దీంతో తనకు భూమిని కేటాయించాలని కోరుతూ శాంత ఉన్నతాధికారులకు వినతి అందించారు. స్థలం కేటాయింపుపై సెక్రటేరియట్ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో బొట్లపేట వద్ద సర్వే నంబరు 5లో స్థల పరిశీలన చేశారు. దీనిపై తక్షణమే పట్టా, పాస్‌బుక్‌లు సిద్ధం చేయాలని తహశీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసరాల డోర్ డెలివరీకి టెండర్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలోని మూడు మండలాల పరిధిలోని చౌక ధరల దుకాణాలకు గ్రామ, వార్డు సచివాలయాలకు నిత్యావసర సరుకులను నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే చేర్చేందుకు (రెండో దశ రవాణా) టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2027 మార్చి 31వ తేదీ వరకు సరఫరా కాంట్రాక్టర్లను నియమించేందుకు ఈ టెండర్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని జి.సిగడాం, మెళియాపుట్టి, సరుబుజ్జిలి మండలాల్లో ఈ సరఫరా చేపట్టాల్సి ఉందన్నారు. ఆసక్తి కలిగిన కాంట్రాక్టర్లు జిల్లా పౌరసరఫరాల మేనేజర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, శ్రీకాకుళం పేరున రూ.ఐదు వేలు డిమాండ్ డ్రాఫ్ట్‌ను చెల్లించి, టెండర్ ప్రక్రియలో పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ https://tender.apeprocurement.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఈనెల 22వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా దాఖలు చేసుకోవాలని సూచించారు.

ఆడిట్‌లను వాయిదా వేయాలి : యుటిఎఫ్




ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా, మండల పరిషత్‌లో పాఠశాలల్లో మండు వేసవిలో ఆడిట్ల పేరుతో ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయడం తగదని, తక్షణమే ఆడిట్లను వాయిదా వేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బమ్మిడి శ్రీరామ్మూర్తి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులు రకరకాల పనులతో సుదూర ప్రాంతాల్లో ఉంటారని, రికార్డులన్నీ పాఠశాలలో ఉంటాయని గుర్తుచేశారు. రికార్డులన్నింటినీ సేకరించి ఇప్పటికిప్పుడు ఆడిట్ చేయమనడం సరైన నిర్ణయం కాదని పేర్కొన్నారు. బదిలీలు, రేషనలైజేషన్ బిజీలో ఉన్న సమయంలో ఈ ప్రక్రియ ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. సమగ్ర శిక్ష అధికారులు ఆడిట్లను పాఠశాలలు తెరిచిన తర్వాత నిర్వహించుకోవాలని సూచించారు. ఆడిట్ల పేరుతో ప్రధానోపాధ్యాయుల వద్ద అక్రమ వసూళ్లను నిలుపుదల చేయాలని పేర్కొన్నారు. టెక్కలిలో ఇటీవలే సోషల్ ఆడిట్ పేరుతో ఉపాధ్యాయులందరినీ కేంద్రానికి రప్పించి అక్రమ కలెక్షన్లు చేశారని, 15 రోజుల్లో మళ్లీ ఆడిట్ ఉందని చెప్తున్నారని తెలిపారు. వేసవి సెలవుల్లో విశ్రాంతి లేకుండా ఇటువంటి చర్యలు జిల్లా అధికారులు మానుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే యుటిఎఫ్ పక్షాన ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

- లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు
- గ్రానైట్ బ్లాక్స్ పడి లారీ డ్రైవర్ మృతి
- ఎనిమిది మంది ప్రయాణికులకు గాయాలు





ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

మండలంలోని సింగపురం సమీపాన జాతీయ రహదారిపై శనివారం వేకువజామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో విశాఖపట్నం జిల్లా సబ్బవరానికి చెందిన లారీ డ్రైవర్ రాపర్తి నూకరాజు (42) మృతి చెందాడు. ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తున్న ఎనిమిది మందికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశాలోని కొరాపుట్ నుంచి 35 మంది ప్రయాణికులతో వెళ్తున్న కంబేశ్వరి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎనిమిది మంది ప్రయాణికులు గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను అంబులెన్స్ ఎక్కించడానికి రోడ్డుపై ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఈ సమయంలో మూడు లారీలు ఒకదాని వెనుక ఒకటి వచ్చి నిలిచాయి. వీటి వెనుక రాయికాంతం నుంచి కోటబొమ్మాళికి గ్రానైట్ బ్లాక్స్‌తో వచ్చిన లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో రెండు వరుసల్లో పెట్టిన గ్రానైట్ బ్లాక్ దొర్లుకుంటూ డ్రైవర్ కేబిన్‌పై పడింది. దీంతో లారీ డ్రైవర్ రాపర్తి నూకరాజు నలిగిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మూడు లారీలు నుజ్జు అయ్యాయి. సమాచారం అందుకున్న ఒకటో పట్టణ సిఐ పైడపునాయుడు, రూరల్ ఎస్ఐ రాము సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనిత




సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిఎంహెచ్ఒ అనిత

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఆరోగ్యకర ఆహారపు అలవాట్లు అలవరచుకుని శారీరక వ్యాయామం చేయడం ద్వారా రక్తపోటును అధిగమించవచ్చని డిఎంహెచ్ఒ డాక్టర్ కె.అనిత అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం 18 ఏళ్లు నిండిన వారిలో 25 శాతం రక్తపోటుకు గురవుతున్నారని అనానరు. వ్యాయామం తగ్గడమే ప్రధాన కారణమన్నారు. ప్రతిఒక్కరూ వారంలో ఐదు రోజులు 30 నుంచి 40 నిమిషాలు వ్యాయామం చేయాలన్నారు. ఉప్పు, స్వీట్స్, నూనెలు వాడకం తగ్గించి ముందస్తు జాగ్రత్తలు పాటించడం చాలా అవసరమన్నారు. తరచుగా బిపి పరిశీలించుకోవాలన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. వీటితో పాటు వైద్యాధికారుల సూచనల మేరకు ప్రతిఒక్కరూ జీవనశైలిలో మార్పు చేసుకోవాలన్నారు. వ్యాయామం, బిపి నియంత్రణలో ఉంచుకునేందుకు కృషి చేస్తామని ర్యాలీలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ మేరీ కేథరిన్, ఎన్‌సిడి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఇ.వెంకటరావు, డిపిఎంఒ డాక్టర్ రవీంద్ర, ఎపిడిమాలజిస్టు డాక్టర్ సుజాత పాల్గొన్నారు.

అనుమతుల్లేని క్వారీలపై కేసుల నమోదు


డిఎస్‌పి సిహెచ్.వివేకానంద



కృష్ణాపురంలో క్వారీని పరిశీలిస్తున్న డిఎస్‌పి వివేకానంద

పొందూరు: ప్రభుత్వం నుంచి ఎటువంటి మైనింగ్ లీజు, అనుమతుల్లేని క్వారీల నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్. వివేకానంద హెచ్చరించారు. ఎస్‌పి ఆదేశాల మేరకు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇఖ క్వారీలను శనివారం పరిశీలించారు. అనంతరం మండలంలో గల క్వారీ నిర్వాహకులు, స్టోన్ క్రషర్స్ యాజమాన్యం, ఎక్స్‌ప్లోజివ్ మందులు విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. క్వారీల్లో పేలుళ్లు అనుమతి గల నిపుణుడైన బ్లాస్టర్ ద్వారా మాత్రమే చేయాలని సూచించారు. అలాకాకుండా సాధారణ కూలీలతో బ్లాస్టింగ్ చేస్తే మైనింగ్ లీజుదారులు, క్వారీ నిర్వాహకులపై ఎక్స్‌ప్లోజివ్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండల పరిధిలో లీజులు, అనుమతి గల క్వారీలతో పాటు అనుమతి లేని క్వారీల నిర్వహణకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి, నివేదికను అందజేయాలని ఎస్ఐ సత్యనారాయణను ఆదేశించారు.

తాత్కాలికంగా క్వారీల నిలుపుదల



క్వారీ నిర్వాహకులతో మాట్లాడుతున్న తహశీల్దార్ వెంకటేష్

పొందూరు: మండలంలోని రాపాక, కృష్ణాపురం, పుల్లాజీపేట తదితర రెవెన్యూ గ్రామాల పరిధిలో చేపడుతున్న క్వారీల నిర్వహణను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని తహశీల్దార్ ఆర్.వెంకటేష్ రామానుజులు ఆదేశించారు. మండలంలోని పలు క్వారీలపై ఎస్ఐ వి.సత్యనారాయణతో కలిసి శనివారం దాడులు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ప్రాథమిక విచారణలో భాగంగా చేపట్టిన దాడుల్లో ఎక్కువ క్వారీలు అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. కృష్ణాపురం వద్ద 335 సర్వే నంబరులో అప్పలరాజు అనే వ్యక్తికి 2.5 ఎకరాలకు మాత్రమే లీజు అనుమతులు ఉండగా, పదుల హెక్టార్లలో క్వారీ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. తనకు తెలియకుండా తన పక్కన కొంతమంది క్వారీ నిర్వహిస్తున్నట్లు అధికారులకు అప్పలరాజు చెప్పడంతో తహశీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలియకుండా పక్కన క్వారీ ఎవరో ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. క్వారీ అనుమతులు రద్దు చేయడమే కాకుండా పది రెట్లు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మరికొంత మంది డి-పట్టా భూముల్లో క్వారీలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. వీరికి నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు తాత్కాలికంగా క్వారీల నిర్వహణ నిలుపుదల చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. మైనింగ్ అధికారులతో కలసి సంయుక్త విచారణ చేస్తామని, తర్వాతే నిర్వహణకు అనుమతులు ఇస్తామని తహశీల్దార్ స్పష్టం చేశారు.

ఎమ్మెల్యేలను కష్టపెట్టడం బాబుకు ఇష్టం లేదా?



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఎమ్మెల్యేలను ఆర్థికంగా, శారీరకంగా కష్టపెట్టడం బాబుకు ఇష్టం లేనట్లుగా కనిపిస్తోంది. నిరుడు ఎన్నికల్లో బాగా డబ్బులు ఖర్చు చేశారని గుర్తించారో ఏమో బంగారు కుటుంబాలను ఆదుకునే పి-4లో వారిని దూరంగా ఉంచారు. మరోవైపు 'స్వర్ణాంధ్ర సంకల్పం' పేరుతో ఈనెల 21, 22, 23 తేదీల్లో పల్లె బాటను కేవలం ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు, ప్రభుత్వ శాఖల అధికారులకే పరిమితం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు మినహాయింపు ఇచ్చారు. మరికొద్ది రోజుల్లో చేపట్టనున్న పల్లెబాటపై అధికారుల్లో గుబులు మొదలైంది. ఇందుకోసం ప్రభుత్వం కఠినమైన మార్గదర్శకాలనే రూపొందించింది. మూడు పగళ్లు, రెండు రాత్రులు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల భవనంలో నిద్రించాల్సి ఉంటుందని చెప్తోంది. పల్లెలకు వెళ్లే అధికారులు రాజకీయ నేతలకు దూరంగా ఉండాలనే చెప్తూనే, వారి ఇళ్లకు వెళ్లకూడదని నిబంధనలు విధించింది. ఉక్కపోతగా ఉందనో, దోమలు కుడుతున్నాయనో రాత్రి సమయాల్లో నేతల ఇళ్లలో బస చేయకూడదని షరతు విధించింది.

పల్లె బాటలో పాల్గొని వచ్చాక వారు గమనించిన అంశాలపై యాప్‌లో నమోదు చేయాలని సూచించింది. ప్రభుత్వ పథకాల అమలు, అవి అందుతున్న తీరు, వాటి అమల్లో ఇబ్బందులు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు టాస్క్ సిద్ధం చేస్తోంది. ప్రజల సాధకబాధకాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం పల్లె బాట నిర్వహించడం మంచిదే. తమ బాగోగులు, గ్రామాల్లో సమస్యలు చూడడానికి ఎన్నుకున్న ఎమ్మెల్యేలను పంపకుండా అధికారులను ఎందుకు పంపిస్తున్నారా అనే చర్చ గ్రామాల్లో మొదలైంది. ఎన్నికల ముందు తమ గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే కదా తమకు ఇది చేస్తాం, అది చేస్తామనే హామీలు ఇచ్చారు. మరి అవి ఎంతవరకు వచ్చాయో వారిని అడిగితే కదా తెలిసేది. అయినా అధికారులతో కలిసి సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలను గ్రామ పర్యటనలకు దూరంగా ఉంచడమేమిటా అని వారు సందేహిస్తున్నారు. తమ గ్రామాన్ని ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదనో, పథకాల అమల్లో వివక్ష చూపుతున్నారనో ప్రజలు నిలదీసే పరిస్థితి గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో చేపట్టిన జన్మభూమి సభల అనుభవాలు చెప్తున్నాయి. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా సరిగా సంక్షేమ పథకాలు అమలు కాకపోవడం, సూపర్ సిక్స్ అమలు చేయకపోవడం, తమ ఆకాంక్షలకు అనుగుణంగా పాలన లేదనే అసంతృప్తి ప్రజల్లో గూడు కట్టుకుని ఉంది. ప్రభుత్వం, ఎమ్మెల్యేలను ప్రజాగ్రహం తాకకుండా ఉంచేందుకే అధికారులను సింగిల్‌గా పంపే ప్రయత్నం చేస్తోందన్న చర్చ నడుస్తోంది.

అన్నివిధాలుగా ఆర్థికంగా పైకొచ్చిన వారు పేద కుటుంబాలను ఆదుకుంటే సమాజంలో అసమానతలు ఉండవని, అందుకే పి-4 కార్యక్రమాన్ని తీసుకొచ్చామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్తున్నా, జిల్లాలో అది పెద్దగా వర్కవుట్ అయిన పరిస్థితి కనిపించడం లేదు. సమాజంలోని అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేద కుటుంబాలను 20 శాతం సంపన్నులు ఆదుకుని స్ఫూర్తి ప్రదాతలుగా నిలవాలన్నది బాబు గారి పిలుపు. ఆ పిలుపునకు మాత్రం జిల్లాలో పెద్దగా ఊపు మాత్రం రాలేదు. పి-4 పేరుతో సర్వే చేసి బంగారు కుటుంబాలనైతే ఎంపిక చేశారు గానీ వారిని ఆదుకునే స్ఫూర్తి ప్రదాతలు మాత్రం ముందుకు రావడం లేదు. జిల్లాలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన కుటుంబాలు 75,566 కుటుంబాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరికి ఉపాధి, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై చేయూతనిచ్చే మార్గదర్శకులు మాత్రం కరువయ్యారు. పేదలకు తమకు తోచిన సాయం అందిస్తామంటూ జిల్లాలో ఇప్పటివరకు 17 మందే వచ్చారు. అయితే వీరేమీ సమాజంలో మొదటి 20 శాతంగా ఉన్న అత్యంత సంపన్నులేమీ కాదు. విద్యాసంస్థల అధినేతలు, ఆస్పత్రుల మేనేజింగ్ డైరెక్టర్లు, చిన్నపాటి పారిశ్రామికవేత్తలు వంటి వారు మాత్రమే ముందుకు వచ్చారు.

వారు కొంత సామాజిక స్పృహతో చొరవ చూపడం అభినందనీయమే. తరతరాలు అనుభవించినా తరగని సంపద, వందల కోట్ల రూపాయల టర్నోవర్‌తో నడుస్తున్న పరిశ్రమల అధిపతులు, వందలాది ఎకరాల భూములు అనుభవిస్తున్న పెద్దలు, కోట్ల రూపాయలను ఆదాయ పన్నుగా చెల్లిస్తున్న బడా వ్యాపారులు ఇలా చెప్పుకుంటూ వెళ్తే సంపన్నుల జాబితా చాంతాడులా ఉంటుంది. వారెవరూ ముందుకు రాకపోవడం పి-4కు లోటే. వారి విషయం పక్కన పెడితే నిత్యం ప్రజా సేవ, పేదల సంక్షేమం, సమగ్రాభివృద్ధి అంటూ ప్రసంగాలతో ఊదరగొట్టే మన ప్రజాప్రతినిధులూ వారి కోవలోకే చేరిపోయారు.

జిల్లాలో ఒక్క ఎమ్మెల్యే కూడా కనీసం ఒక బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకుంటామని ముందుకు రాకపోవడం పేదల సంక్షేమంపై వారి చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోంది. ఇటువంటి విషయాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలే ముందు చొరవ చూపితే దాని ప్రభావం వేరుగా ఉంటుంది. తాము ఫలానా కుటుంబాలను ఆదుకుంటామని వారు ప్రకటిస్తే, ఇతర సంపన్న కుటుంబాలూ ముందుకొచ్చే అవకాశం ఉంది. పేదలను దత్తత తీసుకోవాలని మరి చంద్రబాబు ఎక్కడా ఎమ్మెల్యేలకు ఎందుకు సూచించడం లేదో?, వారు సంపన్నులు కారని బాబు భావిస్తున్నారా?, లేక వారిపై ఈ భారం ఎందుకని మినహాయింపునిచ్చారో తెలియడం లేదు. ఇప్పుడు ఎన్నికైన కూటమి ఎమ్మెల్యేలు పేదలేమీ కాదని నిరుడు సార్వత్రిక ఎన్నికల్లో ఖర్చు చేసిన సొమ్ములు, వారు అఫిడవిట్ దాఖలు చేసిన ఆస్తుల వివరాలే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. గెలుపు కోసం ఓటుకు రూ.మూడు వేల నుంచి రూ.ఐదు వేల వరకు ఖర్చు చేసిన వైనం ప్రజలకూ తెలుసు. ఎన్నికల్లో అంతలా డబ్బును కుమ్మరించిన నేతలు బాబు పిలుపునిచ్చిన పి-4 కార్యక్రమం కింద పేద కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మాత్రం వారికి మనస్కరించడం లేదు.



వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక ఎన్‌టిఆర్ కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రజలకు వివరించారు. ప్రధానంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, నూతన పింఛన్లు మంజూరు చేయాలని, నూతన గృహాలు మంజూరు చేయాలని ప్రజల నుంచి పెద్దఎత్తున వినతులు అందుతున్నాయి. ప్రజల నుంచి వచ్చిన వినతులు మంత్రి పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోన్ మాట్లాడారు. త్వరితగతిన ప్రజలకు మేలు చేసేవిధంగా సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



విచారణ చేస్తున్న డిఎస్‌పి వివేకానంద

అట్రాసిటీ కేసుపై డిఎస్‌పి విచారణ

పొందూరు: మండలం బాణాం గ్రామానికి చెందిన సూర సూరిబాబు ఫిర్యాదు మేరకు నమోదైన అట్రాసిటీ కేసుకు సంబంధించి శనివారం తండ్యాం పంచాయతీ మూడు మర్రిచెట్లు వద్ద డిఎస్‌పి వివేకానంద విచారణ జరిపారు. బాణాం గ్రామానికి చెందిన పి.రవిబాబు, మూడు మర్రిచెట్లు వద్ద గల త్రినాధస్వామి ఆలయ నిర్వాహకులు జ్యోతిస్వామిలు తనను కులం పేరుతో దూషించి దాడి చేసినట్లు సూరిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన జరిగిన మూడు మర్రిచెట్లు వద్ద పలువురిని డిఎస్‌పి విచారించారు. ఈయనతో పాటు ఎస్ఐ సత్యనారాయణ ఉన్నారు.




సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. శనివారం జి.సిగడాం ఎంపిడిఒ కార్యాలయంలో మండలస్థాయి ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకుండా వాస్తవాలను గుర్తించి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ప్రజల సమస్యలకు సంబంధించిన అర్జీలకు పరిష్కార దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రామకృష్ణ, తహశీల్దార్ ఎం.సరిత, కూటమి నాయకులు కుమరాపు రవికుమార్, పైల విష్ణుమూర్తి, మీసాల రవికుమార్, సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, సర్పంచ్ ప్రతినిధి గౌరీశంకరరావు, వెంకటేశ్వరరావు, భూపతి అర్జున్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలి

కొత్తూరు: డి-పట్టా భూములకు అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలని కర్లెమ్మకు చెందిన రైతులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ బాలకృష్ణను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్లెమ్మ రెవెన్యూ గ్రామాల్లో భూ సర్వేలో డీ పట్టాలు కలిగిన రైతులకు ఎల్‌పిఎం నంబర్లు లేవని అన్నారు. దీంతో రైతు పథకాలకు నమోదుకాక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు ధర్మారావు, భాస్కరరావు, లక్ష్మీనారాయణ, చిన్నమ్మి, రామారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

రమణకు డాక్టరేట్



డాక్టరేట్‌ను అందుకుంటున్న రమణ

నౌపడ : సంతబొమ్మాళి మండలం సముద్ర తీర ప్రాంతంలోని ఉమిలాడకు చెందిన మత్స్యకారుడు వి. రమణకు డాక్టరేట్ అందజేశారు. రమణ సామాజిక సేవ చేవలో ముందుండేవారు. దీంతో ఢిల్లీలోని అమెరికన్ గ్లోబల్ హ్యూమన్ యూనివర్సిటీ నుంచి చీఫ్ ఇన్కమ్ టాక్స్ కమిషనర్ డాక్టర్ ఆలపాటి చేతుల మీదుగా శనివారం డాక్టరేట్‌ను అందుకున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగం చేసి గతేడాది మే 31న ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం మత్స్యకారుల సంక్షేమ, అభివృద్ధికి కృషి చేశారు. సామాజిక సేవలను గుర్తించి డాక్టరేట్‌ను అందజేశారు. రమణకు స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్, మత్స్యకార సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

కిచెన్ గార్డెన్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కూర్మారావు

మందస: గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు కిచెన్ గార్డెన్, కంపోస్ట్ పిట్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ఐటిడిఎ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మందస పంచాయతీ పరిధిలోని గ్రామ సంఘాల మహిళా సంఘాల పుస్తక నిర్వహణను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి జాబ్ కార్డు ఉన్న కుటుంబం కూడా తప్పనిసరిగా కిచెన్ గార్డెన్, కంపోస్ట్ పిట్స్ నిర్మించుకుని ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా స్వచ్ఛంద, స్వర్ణాంధ్రా నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, గ్రామ సంఘం మహిళా సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రేషన్ సరుకుల పంపిణీ

- కలెక్టర్, జెసి ఆదేశాలతో కార్డుదారులకు సరుకులు
- పర్యవేక్షించిన తహశీల్దార్ రాజశేఖర్

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని లక్ష్మీపురం రేషన్ డిపోలోని నేదురుపేట గ్రామంలో 315 మంది కార్డుదారులకు కలెక్టర్, జెసి ఆదేశాల మేరకు ఎట్టకేలకు రేషన్ సరుకులు శనివారం



సరుకులు పంపిణీ చేయిస్తున్న తహశీల్దార్

పంపిణీ చేశారు. గతంలో రేషన్ డీలర్ దల్లి రమణమ్మ అవినీతికి పాల్పడి కార్డుదారులకు సక్రమంగా సరుకులు ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలించి అమ్మేయడంతో స్థానికులు పట్టుకొని అధికారులకు ఫిర్యాదు చేయడం, కందిపప్పు, పంచదార కార్డుదారులకు ఇవ్వకుండా వారితో బయమెట్రిక్ వేయించుకుని ఆ సరుకులు బయట మార్కెట్‌లో అమ్మేయడం వంటి అవినీతికి పాల్పడటంతో ఇటీవల రెండు గ్రామాల కార్డుదారులు తమకు ఆ డీలర్ మాకొద్దు, ఆమె పంపిణీ చేస్తే తాము సరుకులు తీసుకోమని, డీలర్‌ను తొలగించి ఇంకొకరితో పంపిణీ చేసినా లేదా స్వయంశక్తి సంఘానికి అప్పగించినా తాము సరుకులు తీసుకుంటామని గ్రామస్తులంతా ఏప్రిల్ 29న తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేశారు. దీంతో తహశీల్దార్ రాజశేఖర్ గ్రామానికి అధికారులను పంపించి డీలర్‌పై విచారణ చేయిస్తామని హామీ ఇవ్వడంతో వారంతా ఆందోళన విరమించారు. మే 8న గ్రామానికి రెవెన్యూ అధికారుల బృందం విచారణ చేసి నివేదికను తహవీల్దార్‌కు, జిల్లా ఉన్నతాధికారులకు పంపించడంతో గ్రామంలో



రేషన్ సరుకుల కోసం వేచి ఉన్న కార్డుదారులు

కార్డుదారులకు సరుకులు ఎట్టిపరిస్థితుల్లోనూ అందజేయాలని కలెక్టర్, జెసి తహశీల్దార్ రాజశేఖర్‌ను ఆదేశించడంతో ఎండియు ఆపరేటర్‌ను యుద్ధప్రాతిపదికన నియమించి మండలంలో ఉన్న డిపోల్లోని క్లోజింగ్ బేలన్స్ స్టాకులను లక్ష్మీపురానికి తరలించి కార్డుదారులకు బియ్యాన్ని పంపిణీ చేశారు. దీంతో గత రెండు నెలలుగా సరుకులు లేక ఇప్పుడు బియ్యాన్ని అధికారులు పంపిణీ చేయడంతో కార్డుదారులు ఆనందం వ్యక్తం చేశారు. పంపిణీ ఏర్పాట్లును తహశీల్దార్ మంగం రాజశేఖర్ దగ్గరుండి పర్యవేక్షణ చేశారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి సుధారాణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాపర్తి అప్పలరాజు, విఆర్ఒ మల్లేశ్వరరావు, రత్నాకర్ తదితరులున్నారు.

నేటి నుంచి సంబరాలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని డోకులపాడు పంచాయతీ చినడోకులపాడులో ఉన్న అంబికాదేవి గ్రామ దేవతల సంబరాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ సంబరాలకు యాత్రికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మూడు రోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీ

పాతపట్నం : మండలంలోని గోపాలపురంలో శనివారం టిడిపి సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. పార్టీ సభ్యత్వ నమోదులో కార్యకర్తలుగా మేమంతా కలిసి పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తామని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పైల బాబ్జి, టౌన్ పార్టీ అధ్యక్షుడు సైలాడ సతీష్, యూనిట్ ఇన్‌ఛార్జి అక్కంద్ర సన్యాసిరావు, బూత్ ఇన్‌ఛార్జి బమ్మిడి రమణయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ చినబడాం విద్యుత్ ఫీడర్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని పలాస డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.యజ్ఞేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు 33/11 కెవి సబ్‌స్టేషన్ మరమతులు, కొత్త విద్యుత్ లైన్లు వేస్తున్నామని అన్నారు. ఆర్.కె.పురం, పెంటిభద్ర, జయరామ చంద్రపురం, పద్మనాభపురం, పాత జాతీయ రహదారి రోడ్డు, తాళభద్ర, నీలాపురం, నర్సిపురం, రైల్వేగేట్ డౌన్, పెసర పాడు, చినబాడాం అంతరకుడ్డ, రాజపురం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడు తుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ధర్మాన పరామర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

సానివాడ ఎంపిటిసి రుప్ప అప్పలసూరి మాతృమూర్తి అమ్మానమ్మ గురువారం మృతిచెందడంతో వారి కుటుంబాన్ని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.



నివాళ్లర్పిస్తున్న ధర్మాన ప్రసాదరావు



వినతిపత్రం అందజేస్తున్న ఢిల్లీరావు

న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని పెద్దకొజ్జిరియాకు చెందిన కౌలు రైతు బల్లెడ నరసింహమూర్తి గత నెల 9న ఆత్మహత్యకు పాల్పడ్డారని, ఇప్పటి వరకు బాధితుడి కుటుంబానికి ఎటువంటి పరిహారం అందజలేదని బిసి సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఢిల్లీరావు అన్నారు. ఈ మేరకు పలాసలోని ఆర్‌డిఒ వెంకటేష్‌ను, డిఎస్‌పి వి.వి.అప్పారావులను శనివారం బాధిత కుటుంబ సభ్యులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నరసింహమూర్తి కొద్దిపాటి కొబ్బరి తోట ఉండగా, మరో ఎనిమిది ఎకరాలు కవులకు పొంది వ్యవసాయం చేశారని అన్నారు. ఈ సమయంలో పంట పండక, పండిన పంటకు మద్దతు ధర లేక అప్పుల పాలయ్యారని అన్నారు. అప్పుల తీర్చలేక నరసింహమూర్తి పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారని అన్నారు. కంచిలి పోలీసులు కేసు దర్యాప్తు చేశారని అన్నారు. ఇప్పటివరకు అటువంటి నివేదిక ఉన్నతాధికారులకు వెళ్లకపోవడంతో బాధిత కుటుంబానికి ఎటువంటి సహాయం అందలేదని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- కవిటి



బైరెడ్ల పవిత్ర బడే ప్రశాంత్ కర్రి అనిత జి మహాలక్ష్మి

ఇటీవల విడుదలైన ఎపిఆర్‌జెసి, పాలీ సెట్‌లో కవిటి, బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించి సత్తా చాటారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన బైరెడ్ల పవిత్ర ఎపిఆర్‌జెసిలో 20వ ర్యాంకు సాధించగా, బడే ప్రశాంత్ 124వ ర్యాంకు, బైరెడ్ల హర్షిత 1855, జి.మహాలక్ష్మి 2,969 ర్యాంకులు సాధించారు. పాలీ సెట్‌లో నెయ్యిల హాసిని 1849, కర్రి అనిత 2766, బైరెడ్ల హర్షిత 4610 ర్యాంకులు సాధించారు. అలాగే బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.ఉదయ్ 828, లోళ్ల సారిక 1371 (ఎపిఆర్‌జెసిలో) ర్యాంకులు సాధించగా, పాలీ సెట్‌లో ఎస్.ఉదయ్ 1249, ఇ.గణేష్ 1461 ర్యాంకులు సాధించారు.

వారిని ప్రధానోపాధ్యాయులు బెందాళం మల్లేశ్వరరావు, సనపల రామకృష్ణ, ఎస్ఎంసి ఛైర్మన్లు తెప్పల మోహనరావు, సౌమ్య శ్రీపతి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.


కళింగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

సోంపేట: సోంపేట పట్టణ కళింగ సంక్షేమ సంఘ నూతన కార్యవర్గాన్ని పెద్దలు శనివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులు పిండి కృష్ణారావు అధ్యక్షతన న్యాయవాది దుప్పల చలపతిరావు నివాసంలో పాల్గొని కుటుంబ సభ్యుల ఏకగ్రీవ ఎంపికతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా తమ్మినేని శేషయ్య, ముఖ్య సలహాదారులుగా సోంపేట పట్టణ వైద్యుడు రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షునిగా పొందూరు శ్రీధర్, కార్యదర్శిగా వజ్జ కృష్ణారావు, సంయుక్త కార్యదర్శులుగా పైడి సునీల్, పండి రమణమూర్తి, కోశాధికారిగా దుప్పల చలపతిరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే సమయంలో కళింగ సంక్షేమ సంఘానికి చీఫ్ కో-ఆర్డినేటర్లుగా భావన శ్రీకాంత్, వెదుళ్ల తిరుపతిరావు, మాదిన ప్రసాద్ కమిటీ ప్రతిపాదించింది. జర్నలిస్టు బమ్మిడి రుక్మంగదరావు, పండి సురేష్‌లను కమిటీ



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

శాశ్వత సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ నూతన కార్యవర్గం త్వరలో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ గుంట లచ్చయ్య, మజ్జి వైకుంతరావు మాస్టారు, అన్నెపు వల్లభరావు, బెందాళం రమణమూర్తి, లోల్ల సుధాకర్, ముఖలింగం స్వామి పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

కోటబొమ్మాళి: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 1989-90లో పదో తరగతి చదువుకున్న పూర విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి రూ.44,612ల చెక్కును డిఇఒ ఎన్.తిరుమల చైతన్య చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయులు డి.గోవిందరావుకు శనివారం అందజేశారు. 2023లో పాఠశాల ఆవరణలో మట్టి నింపేందుకు రూ.10వేలు అందజేశామని, ఇప్పుడు రూ.44,612 చెక్కు రూపంలో అందజేశామని తెలిపారు. పాఠశాలలో సైన్స్ ల్యాబ్ అభివృద్ధికి, ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటుకు వినియోగించాలని విన్నవించారు. కార్యక్రమంలో షణ్ముఖ మాస్టర్, రెయ్యి అర్జున్, ఎం.జె.ఎం.పట్నాయక్, ఆనంద్, రమేష్, రామన్న, బోయిన గోవిందరాజులు, మేమున్నాం సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొనానరు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



గార : చెత్తను తొలగిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- ఆమదాలవలస

పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యతని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాలను ఎంత పరిశుభ్రంగా ఉంచుకుంటే మన ఆరోగ్యానికి అంత మంచిదన్నారు. వివిధ రకాల వ్యాధులకు అనారోగ్యానికి పరిసరాల అపరిశుభ్రతే కారణమన్నారు. ప్రభుత్వం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపట్టిందని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పారిశుధ్య కార్మికులకు డస్ట్ బిన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ శివ్వాల సూర్య నారాయణ, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీత, టిడిపి నాయకులు అన్నెపు భాస్కరరావు, సనపల చెల్లం నాయుడు, కూన ఆంజనేయులు, నాగళ్ల మురళీధర్, పివివి ప్రసాద్, దవల అప్పలనాయుడు, కమిషనర్ పూజారి బాలాజీప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తమ్మినేని గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

గార : టెంపుల్ పర్యాటక కేంద్రాల్లో ఒకటైన గార మండలంలోని శ్రీకూర్మంలో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. స్వచ్ఛందంగా చెత్తను తొలగించిన ఆయన ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ప్రతి నెల మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శ్రీకూర్మంను ఆయన సందర్శించారు. ఆర్‌టిసి బస్టాండ్ వెనుక భాగంలో చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకు పోవడాన్ని గమనించిన ఆయన తక్షణమే వాటిని తొలగించాలని ఆదేశించారు. గ్రామంలోని పెద్ద దల్లాం చెరువు పనులను పరిశీలించారు. ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను అడిగి తెలుసు కున్నారు. అలాగే సిసి రోడ్డు పనుల్లో భాగంగా జరుగుతున్న వాటర్ క్యూరింగ్ పరిస్థితులను పరిశీలించారు. జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరక్టర్ శాంతిశ్రీ, తహశీల్దార్ చక్రవర్తి, అధికారులు పాల్గొన్నారు.

బూర్జ: మండల కేంద్రంలో స్వచ్ఛంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండ తీవ్రత వల్ల కలిగే అనర్థాలను ఉపాధిహామీ కూలీలకు ఎంపిడిఒ తిరుపతిరావు అవగాహన కల్పించారు. అధిక ఉష్ణోగ్రతల వలన ప్రతిఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కూలీలకు అవసరమైన తాగునీరు, మజ్జిగను అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాజశేఖర్, ఎంపిటిసి పోలినాయుడు, సిహెచ్ఒ అప్పలస్వామి, హెల్త్ సూపర్‌వైజర్ సరోజిని, కార్యదర్శి బి.కిరణ్ కుమార్, స్థానిక సర్పంచ్ అనురాధతో పాటు అధికారులు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం గ్రామపంచాయతీ, హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమానికి మండల పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖాధికారి వి.ప్రకాష్ హాజరయ్యారు. మొక్కలను విరివిగా పెంచాలన్నారు. సర్పంచ్ ప్రతినిధి రౌతు శ్రీనివాసరావు, కార్యదర్శి పి.అజయ్‌బాబు, హరిత సొసైటీ వ్యవస్థాపకులు ఆర్.హరిబాబు, సొసైటీ సెక్రెటరీ పి. తవిటి నాయుడు, జాయింట్ సెక్రెటరీ బి.లక్ష్మీనరసింహమూర్తి, జి.అప్పల నాయుడు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



ఆమదాలవలస : చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

శ్రీకాకుళం రూరల్ : ప్రతిఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ అరవల రాంప్రతాప్ అన్నారు. మండలంలోని నైరాలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర భాగంగా పారిశుధ్య పనులు చేపట్టారు. సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛాంధ్రా కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్, పలాస వ్యవసాయశాఖ ఎడి లింగాల మధుబాబు, ఎంపిడిఒ నరసింహప్రసాద్‌పండా, ఎంఇఒ-2 పద్మనాభరావు మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి చింతల అప్పారావు, ఎపిఒ రవి పాల్గొన్నారు. అనంతరం ఉపాధి హామీ పనుల వరకు ర్యాలీ నిర్వహించి కూలీలకు అవగాహన కల్పించారు.

పాతపట్నం: మండలంలోని కొరసవాడలో ఉపాధి కూలీలకు స్వచ్ఛాంధ్రాలో భాగంగా పారిశుధ్యంపై మండల ప్రత్యేకాధికారి డాక్టర్ మంచు కరుణాకరరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, డిటి ప్రసాదరావు, సర్పంచ్ జె.ఉమాదేవి, సెక్రెటరీ కృష్ణంరాజు, ఎపిఒ సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : రాజావారి మైదానం, వైఎస్ఆర్ కళ్యాణ మండం వద్ద వాకర్స్, క్రీడాకారులకు మున్సిపల్ కమిషనర్ రమేష స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. అలాగే బెల్లుపడ మండపం వద్ద డ్వాక్రా మహిళలతో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆధ్వర్యాన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రకుమార్, సచివాలయ శానిటరీ సెక్రెటరీలు, శానిటరీ మేస్త్రిలు పాల్గొన్నారు.

పలాస : స్థానిక కిడ్నీ రీసెర్చ్ సెంటర్ వద్ద సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ ఆధ్వర్యాన నిర్వహించిన స్వచ్ఛాంధ్రాలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో జవాను మృతి



మోహనరావు (ఫైల్)

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని ఆరవ వార్డు పరిధిలోని తెలగ మన్నయ్యపేటకు చెందిన గొద్దు మోహనరావు (46) బిఎస్ఎఫ్ జవాన్ గుండెపోటుతో మరణించారు. న్యూఢిల్లీలోని బిఎస్ఎఫ్ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తుండగా శుక్రవారం సాయంత్రం గుండెపోటుకు గురయ్యారు. వెంటనే తోటి సైనికులు మోహనరావును సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆదివారం ఉదయం ఆయన మృతదేహం ఢిల్లీ నుంచి విశాఖపట్నంకు, అక్కడ నుంచి స్వగ్రామానికి చేరుకోనుంది. కోరాపుట్ నుంచి బిఎస్ఎఫ్ బెటాలియన్ వచ్చి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. మోహనరావుకు భార్య సంధ్య, కుమార్తె జాస్మిని, కుమారుడు శశాంక్, తండ్రి అప్పలరాము ఉన్నారు. జవాన్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.



చికిత్స పొందుతున్న యాత్రికులు

విహార యాత్రికులకు అస్వస్థత

టెక్కలి రూరల్ : కలుషిత ఆహారం తిని కర్ణాటక రాష్ట్రానికి చెందిన సుమారు 20 మంది విహార యాత్రికులు శనివారం అస్వస్థతకు గురయ్యారు. తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లోని క్షేత్రాలను సందర్శించి టెక్కలి మీదుగా బస్సు వెళ్తుంది. వేకువజామున ఒక్కసారిగా వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే బస్సు సిబ్బంది వీరిని టెక్కలి జిల్లా ఆస్పత్రికిలో చేర్పించారు. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అందరూ కోలుకుంటున్న వైద్యులు తెలిపారు. ఒడిశా రాష్ట్రం బాలాచౌరీ వద్ద శుక్రవారం రాత్రి ఆహారాన్ని తీసుకున్నట్లు యాత్రికులు తెలిపారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

ఆటో స్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఆటో యూనియన్ అభ్యర్థన మేరకు కొత్తగా ఆటో స్టాండ్ నిర్మాణానికి జూనియర్ సివిల్ జడ్జి పరేష్ కుమార్ శనివారం శంకుస్థాపన చేశారు. మేడే ఉత్సవాలు సందర్భంగా నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆటో యూనియన్ నాయకులు ఆటోస్టాండ్‌కు శాశ్వత భవనం కావాలని విన్నవించారు. స్పందించిన జడ్జి మున్సిపల్ అధికార యంత్రాంగంతో మాట్లాడి ఆటో యూనియన్ కావాల్సిన స్టాండ్ నిర్మాణానికి స్థలంలో భూమి పూజా చేశారు. ముందుగా ఆటో యూనియన్ నాయకులు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్, టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్ ప్రసాద్, సిఐ మీసాల చిన్నంనాయడు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎంపీ అప్పలనాయుడు

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

రణస్థలం: మండలంలోని వల్లభరావుపేటకు చెందిన కొప్పల పవన్ కుమార్ కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లి మృత్యువుతో పోరాడి ఇటీవల మృతి చెందారు. పవన్ కుటుంబ సభ్యులకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.7,79,600 విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు రణస్థలం ఎంపీ కార్యాలయంలో శనివారం మృతుడు కుటుంబ సభ్యులకు చెక్కు అందించారు. ఎంపీతో పాటు వల్లభరావుపేట గ్రామపెద్దలు పాల్గొన్నారు.




దుస్తులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

దుస్తుల పంపిణీ

ఇచ్ఛాపురం: ఎమ్మెల్సీ నర్తు రామారావు జన్మదిన వేడుకలు వైసిపి నాయకులు శనివారం నిర్వహించారు. ముందుగా గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో పూలు చేశారు. అనంతరం ఎమ్మెల్సీ రామారావు పేదలకు దుస్తుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, ఎంపిపి బోర పుష్ప, సీడాప్ మాజీ ఛైర్మన్ శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, నర్తు నరేంద్ర యాదవ్, వార్డు కౌన్సిలర్లు పరపటి మంజులతా, ప్రేమ్‌కుమార్, సెల్లా దేవరాజు, పరపటి కోటి, పిలక విజయ్‌భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

గొల్లవూరు వంతెనకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న అజయ్‌కుమార్

నందిగాం: మండలంలోని గొల్లవూరు వంతెన నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశామని టిడిపి మండల అధ్యక్షులు పి.అజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంశధార ఎడమ ప్రధాన కాలువపై జాతీయ రహదారి నుంచి రాంపురం వరకు వెళ్లే రహదారిపై 2023 ఏప్రిల్ నెలలో వంతెన కూలిపోయిందన్నారు. 2018లో అప్పటి ప్రభుత్వం వంతెన మంజూరు చేసి పిల్లర్లు వేసిందని తెలిపారు. అనంతరం వచ్చిన ప్రభుత్వం పనులు నిలిపేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి అచ్చెన్నాయుడు నిధులు మంజూరుకు కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి జీరు నానిరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నవధాన్యాలతో నేలతల్లి సాగు

ప్రజాశక్తి- కవిటి

నవధాన్యాలతో నేలతల్లి సాగుచేసి మంచి ఫలితాలు సాధించాలని ఎపిఎం గోవిందరావు, డిఎంఎంటి తులసయ్య అన్నారు. మండలంలోని శిలగాంలో నవధాన్యాల సాగుపై శనివారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేలతల్లి బాగు కార్యక్రమంలో భాగంగా 9 నుంచి 32 రకాల విత్తనాలను తీసుకొని ఎకరానికి 12 కేజీలు చొప్పున కిట్టు రూపంలో రైతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవధాన్యాలు సాగుతో భూమి గుల్లబారి వానపాములు వృద్ధిచెంది సేంద్రీయ కర్బనం పెరుగుతుందని తెలిపారు. అదే సమయంలో నేలలో నీటిని నిల్వవుంచే సామర్థ్యం పెరగడంతో పాటు నేల కోతకు గురికాకుండా ఉండి మొక్కకు కావాల్సిన 59 పోషకాలు లభిస్తాయని తెలిపారు. నవధాన్యాలు వేసిన 45 రోజుల నుంచి 50 రోజుల లోపల భూమిలో కలియదున్నాలని, లేదంటే పశుగ్రాసంగా కూడా వాడుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా ఎటిఎం మోడల్ పద్ధతిలో అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు సాగుచేస్తున్న ఉత్తమ రైతులు కాళ్ల నూకయ్య, పోకల గణపతిలను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కడియాల బాబూరావు, బల్లెడ సర్వేశం, చిట్టిబాబు, సంతోషి, స్వాతి, జయ పాల్గొన్నారు.



కిట్లు అందిస్తున్న ఎపిఎం గోవిందరావు



దుస్తులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని మురపాక గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు పూరిళ్లు కాలిపోయిన విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ శనివారం బాధితులను పరామర్శించారు. ప్రమాదం ఎలా సంభవించిందన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులు నిరుపేదలని, వీరికి ప్రభుత్వం పక్కాఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకోవాలని, తక్షణ సహాయాన్ని అందించాలన్నారు. అనంతరం బాధితులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లావేరు జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, వైసిపి నాయకులు దన్నాన రాజీనాయుడు, బొంతు సూర్యనారాయణ, బాలి శ్రీనువాసులునాయుడు, సర్పంచ్ ప్రతినిధి పి.లక్ష్మణరావు తదితరులున్నారు.

పాలపోలమ్మ ఆలయ సందర్శన

ఆమదాలవలస : పట్టణంలోని పాలపోలమ్మ అమ్మవారిని జూనియర్ సివిల్ జడ్జి బి.రమ్య శనివారం దర్శించుకున్నారు. ఇటీవల స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో విధుల్లో చేరిన సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మొదలవలస రమేష్, ఆలయ అర్చకులు ఆమెకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర విశిష్టతను ఆమెకు వివరించారు.



ఇచ్ఛాపురం : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దార్ వెంకటరావు

చలివేంద్రాల ఏర్పాటు

ఇచ్ఛాపురం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ వెంకటరావు శనివారం చలివేంద్రం ప్రారంభించారు. వేసవి కావడంతో కార్యాలయానికి వచ్చే ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కవిటి: వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హోమియో డాక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. మండలంలోని జగతిలో శనివారం ఆయన చలివేంద్రం ప్రారంభించి పాదచారులకు తాగునీరు అందించారు.



కవిటి : నీటిని అందజేస్తున్న డాక్టర్ దుర్గాప్రసాద్

సిపిఆర్‌పై అవగాహన అవసరం



సిపిఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వాలంటీర్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రాణాపాయ సమయంలో జీవితాలను కాపాడే శక్తి కార్డియో పల్మనరీ రీసెసిటేషన్ (సిపిఆర్) ఉందని, అందువల్ల ప్రతిఒక్కరూ దీనిపై అవగహన కలిగిఉండాలని ప్రముఖ వైద్యులు జెసిఐ సెనెటర్ డా.వినోద్ కుమార్ కూర్మాన సూచించారు. శనివారం నగరంలోని సిఎంఆర్ షాపింగ్ మాల్ ప్రాంగణంలో జెసిఐ సన్ రైజర్స్ ఆధ్వర్యాన సిపిఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని రక్షించడానికి ప్రజలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని, సిపిఆర్ శిక్షణ ద్వారా సాధారణ వ్యక్తులు కూడా అత్యవసర సమయాల్లో ధైర్యంగా ముందుకు రావడం నేర్చుకుంటారన్నారు. సిఎంఆర్ షాపింగ్ మాల్ ప్రాంగణంలో సిపిఆర్ చేసే విధానాన్ని ప్రాక్టికల్‌గా చూపిస్తూ సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో జెసిఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ సింగూరు, సెక్రటరీ సుదర్శన్, పూర్వ అధ్యక్షులు బగాది ప్రవీణ్, ట్రెజరర్ వెంకటేష్, సిఎంఆర్ షాపింగ్ మాల్ మేనేజర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి- శ్రీకాకుళం

రాష్ట్ర వ్యాప్తంగా నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీర్ వర్కర్స్ యూనియన్ చేపట్టిన నిరవధిక సమ్మె మూడోరోజుకు చేరింది. అందులో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ శిబిరంలో యూనియన్ నాయకులు తిరుపతిరావు, వై.శ్యామలరావు, సతీష్ మాట్లాడారు. ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు, టెక్నికల్ వర్కుర్స్‌కు రూ.29 200, నాన్ టెక్నికల్ వర్కర్లకు రూ.24500 చెల్లించాలని డిమాండ్ చేశారు. సీనియార్టీ ప్రకారం ప్రమోషన్ ఇవ్వాలని, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని, రిటర్మెంట్ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శంకరరావు, మణి, ఆది, ముకేష్ యాదవ్, మజ్జి శ్రీను పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

కొనసాగుతున్న దీక్షలు



దీక్షల్లో పాల్గొన్న బెంతు ఒరియాలు

ప్రజాశక్తి- కవిటి

తమ భవిష్యత్ భరోసాకు బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 507వ రోజుకి చేరుకున్నాయి. అందులో భాగంగా శనివారం దీక్షలో కమిటీ సభ్యులు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. అనంతరం వీరు మాట్లాడుతూ తరగతుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వ పథకాలకు కూడా దూరమవుతున్నట్టు తెలిపారు. అందుకే తమకి గుర్తింపు, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



సూచనలు ఇస్తున్న ఎస్ఇ కామేశ్వరరావు

తాగునీటి సమస్య తలెత్తకూడదు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ ఎస్ఇ పి.కామేశ్వరరావు, సుడా ఎస్ఇ సుగుణాకరరావు అధికారులకు ఆదేశించారు. పట్టణంలోని సంతపేట వద్ద ఉన్న పంపు హౌస్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంపుహౌస్‌ను మరమత్తులు చేపట్టి నీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్.రమేష్, డిఇ సుధాకర్, ఎఇ జగన్నాథం, అవినాష్, పృథ్వీ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

నీటిని పొదుపుగా వాడాలి

లావేరు : వేడిని తరిమి కొట్టండి నీటిని పొదుపుగా వాడండి అని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా నీరు, మీరు కార్యక్రమంపై విద్యార్థులనుదేశించి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితిలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయని, వేడిని తరిమికొట్టి, నీటిని పొదుపు చేయాలన్నారు. నీటిని పొదుపుగా ఎలా వాడుకోవాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. నీటి పొదుపుపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు టి.వీరభద్రరావు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమ్మడి కుటుంబాలే ముద్దు

శ్రీకాకుళం : ఉమ్మడి కుటుంబాల వల్లే మానవీయ విలువలు రక్షించబడతాయని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పొన్నాడ రవి కుమార్ అన్నారు. నగరంలోని పెద్దబరాటం వీధిలో ఉన్న సంస్థ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. వారసత్వ వ్యవస్థగా ఉమ్మడి కుటుంబాలు వర్ధిల్లాలని ఆయన కోరారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బరాటం లక్ష్మణరావు మాట్లాడుతూ నేటితరం కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం కావడానికి నాటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కొనసాగకపోవడమే కారణమన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ నటుకుల మోహన్, సభ్యులు టెక్కం రామ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గుండ దంపతులకు పరామర్శ

శ్రీకాకుళం : ఇటీవల అస్వస్థతకు గురైన మాజీమంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి దంపతులను బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యుడు చల్లా వెంకటేశ్వర రావు శనివారం పరామర్శించారు. వారి ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రాజకీయాల్లో సుదీర్ఘకాలం పాటు ప్రజలకు సేవలందించారని అన్నారు.



ప్రజాశక్తి



శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి
గ్రామ దేవత ఉత్సవాలు
ప్రత్యేక అనుబంధం

Advt. Feature


ఆదివారం 18-05-2025 | శ్రీకాకుళం జిల్లా | 4 పేజీలు

పాలవలసకు పండగ

- వైభవంగా రౌతు పోలమ్మతల్లి ఉత్సవాలు
- 20 ఏళ్ల తర్వాత సంబరాలు
- ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి – సోంపేట

మండలంలోని పాలవలసకు పండగ వచ్చింది. ఊరంతా సంబర వాతావరణం నెలకొంది. గ్రామంలో వెలసిన రౌతు పోలమ్మతల్లి ఉత్సవాలు 20 ఏళ్ల తర్వాత అంగరంగ వైభవంగా (మిగతా...2లో)















పాలవలసకు పండగ

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహిస్తున్నారు. ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఉత్సవాల్లో కుల, రాజకీయాలకు అతీతంగా అందరూ ఐకమత్యంగా భాగస్వామ్యమవుతున్నారు. సుమారు 2,500 కుటుంబాలు ఉన్న పాలవలస పంచాయతీలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న రౌతు పోలమ్మతల్లి సంబరాలు సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. సంబరాల్లో భాగంగా నిర్వహిస్తున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. గ్రామంలోని అన్ని వీధులు విద్యుత్ దీపాలంకరణలతో అలంకరించడమే కాకుండా కూడళ్ల వద్ద భారీ మండపాలు, దేవుళ్ల విద్యుత్ బొమ్మలను ఏర్పాటు చేశారు. వెలుగులు విరజిమ్మే విద్యుద్దీపాలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించేందుకు పరిసర గ్రామాల ప్రజలూ పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు.

తమ పూర్వీకులు కొన్ని దశాబ్దాల కిందట గ్రామంలోని రౌతు పోలమ్మతల్లి సంబరాలను ఏటా నిర్వహించేవారని గ్రామ పెద్దలు చెప్తున్నారు. కాలక్రమేణా బయట ప్రాంతాల వారు అమ్మవారిని తీసుకువెళ్లే క్రమంలో అమ్మవారి విగ్రహం ఊరి అవతలకు చేరడంతో గ్రామ శివార్లలో అమ్మవారికి ప్రత్యేక ఆలయాన్ని నిర్మించి, అప్పట్నుంచి అక్కడ పూజలు చేస్తున్నట్లు చెప్పారు. అమ్మవారిని కొలిస్తే గ్రామంలో శాంతియుత వాతావరణం, పాడిపంటలు సమృద్ధిగా పండుతాయన్న నమ్మకంతో ఏటా సంబరాలు నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. అయితే ఇలా గ్రామం మొత్తం కలిసి పెద్దఎత్తున సంబరాలు చేసుకోవడం రెండు దశాబ్దాలు అవుతోందని చెప్తున్నారు. 20 ఏళ్ల కిందట ఊరి మొత్తం కలిసి సంబరాలు నిర్వహించామని, మళ్లీ ఇప్పుడు ఐక్యంగా సంబరాలు నిర్వహించాలని నిర్ణయించి కార్యక్రమాలు చేపట్టినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

గ్రామంలోని బమ్మిడి వంశానికి చెందిన వారు అమ్మవారి ఆలయం నుంచి అమ్మవారిని తీసుకొచ్చి గ్రామంలోని పెద్ద వీధిలో గల దేవుడు ఇంట్లో దింపుతారు. ఇలా దింపిన తర్వాత అమ్మవారిని కొలిచేందుకు పూర్వీకులు నిర్ణయించిన మర్ల కుటుంబానికి చెందిన వారు తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం బమ్మిడి వంశస్థులు తిరిగి అమ్మవారిని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి ఆలయంలో దింపుతారు. సంబరాలు జరిగే తొమ్మిది రోజుల్లో ప్రతిరోజూ ఒక ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అమ్మవారిని ప్రతిరోజూ గ్రామంలో మేళతాళాలు, నృత్యాలు, పగటి వేషాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాల తోడుగా తిరువీధులు నిర్వహిస్తారు.

ఈనెల 12వ తేదీ నుంచి ప్రారంభమైన సంబరాలు 20వ తేదీ వరకు నిర్వహిస్తారు. 12వ తేదీన గ్రామ శివారులోని రౌతు పోలమ్మ ఆలయం నుంచి అమ్మవారిని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి గ్రామంలోని పెద్దవీధిలోగల దేవుడు ఇంట్లో దించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. 13వ తేదీన స్వేచ్ఛ నృత్య తరంగిణి బృందంతో కూచిపూడి నృత్యం నిర్వహించారు. 14వ తేదీన విశాఖపట్నం కళాకారులతో డాన్స్ బేబీ డాన్స్ ప్రదర్శన చేశారు. 15వ తేదీన ప్రఖ్యాతి గాంచిన రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా కార్యక్రమం ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. 16వ తేదీన ఢీ షో లిటిల్ స్టార్ బృందంతో గ్రూప్ డాన్స్ నిర్వహించారు. అఘోర ఒడిశా కళాకారులతో వీధి ప్రదర్శన నిర్వహించారు. వీటితోపాటు కాంతారా, జాలరి డాన్స్, జానపద నృత్యాలు అలరించాయి. ఆరో రోజైన 17వ తేదీన పార్వతీపురం, మందరాడ, రాజాంకి చెందిన శ్రీ బాలభారతి నాట్యమండలి వారిచే శ్రీ సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటకం ప్రదర్శన ఆకట్టుకుంది. ఏడో రోజైన 18వ తేదీన జబర్దస్త్, ఢీ షో సభ్యులు హైపర్ ఆది, శాంతి స్వరూప్, దొరబాబు, కుమార్ మాస్టర్లతో నిర్వహించనున్న ప్రదర్శన సంబరాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. అదే రోజు రాత్రి విజ్జు వండర్స్ నిర్వాహకుల స్పెషల్ యాక్ట్ షో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 19వ తేదీన కాళీ అమ్మవారి బృందం ప్రదర్శన, మహిళల దాండియా కార్యక్రమాలు ఆకట్టుకోనున్నాయి. సంబరాల్లో చివరి రోజైన మంగళవారం అమ్మవారి సిరిమానోత్సవం, అమ్మవారి ఘటాల ఊరేగింపు వైభవంగా జరగనున్నాయి. తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్న సంబరాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించడానికి బారువ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. పోలీసుల కృషికి గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



అందరి బాధ్యతగా భావించి...

గ్రామ దేవత రౌతు పోలమ్మ సంబరాలను అందరి బాధ్యతగా భావించి చేస్తున్నాం. ప్రజాప్రతినిధులుగా ప్రజలందరికీ ఆమోదయోగ్యంగా సంబరాలు నిర్వహిస్తున్నాం. పంచాయతీ ప్రజలు ఆనందంగా, ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొంటున్నారు. రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సంప్రదాయ నృత్యాలను చూసేందుకు ప్రజలు తండోపతండాలుగా తరలివస్తున్నారు. వలసదారులతో, బంధువులతో పంచాయతీ కళకళలాడుతుంది.

- దుమ్ము రూపవతి, ఢిల్లీరావు, ఎంపిటిసి

అందరి సహకారంతోనే...



సంబరాలను ఘనంగా నిర్వహించాలంటే ఈ రోజుల్లో లక్షలాది రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేశాం. ఇంత పెద్ద మొత్తం సేకరించేందుకు అమ్మవారి కృప కారణంగానే సాధ్యమైంది. ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా ఆర్థిక సహాయాన్ని అందించడం అభినందనీయం.

- గోకర్ణ కృష్ణారావు, నిర్వహణ కమిటీ కోశాధికారి

ఐకమత్యాన్ని పెంపొందిస్తాయి



సామూహికంగా జరిగే ఇటువంటి సంబరాలు ప్రజల్లో ఐక్యతను మరింత పెంచేందుకు దోహద పడతాయి. ఎటు వంటి ఇబ్బందులు లేకుండా సంబరాలు నిర్వహించడం చాలా ముఖ్యమైన అంశం. నిర్వాహకులకు అభినందనలు.

- గార బాబూరావు, పిఎస్ఐ ట్రస్టు అధ్యక్షుడు, పాలవలస

ఐకమత్యాన్ని ప్రోత్సహిస్తాయి



ఊరి ప్రజలంతా నిర్వహించుకునే ఇటువంటి సంబరాలు ప్రజల్లో ఐకమత్యాన్ని ప్రోత్సహిస్తాయి. చిన్న చిన్న గొడవలు, సంఘర్షణలు ప్రజల్లో ఉన్నప్పటికీ సంబరాల సమయంలో అన్నీ మర్చిపోయి ఒక్కటయ్యాం. అందుకు ఆనందంగా ఉంది.

- మర్ల రామారావు, పాలవలస

గ్రామానికి పేరు, ప్రఖ్యాతలు



చాలా ఏళ్ల తరువాత గ్రామంలో ఇంత పెద్దఎత్తున సంబరాలు జరగడం చూస్తున్నా. ఈ సంబరాల కారణంగా చుట్టుపక్కల గ్రామాల్లోనే కాకుండా బయట రాష్ట్రాల్లో కూడా గ్రామం పేరు, ప్రఖ్యాతలు పెరిగాయి.

- దున్న హేమయ్య, పాలవలస

ముందు తరాలకు గుర్తుండిపోవాలి



రౌతు పోలమ్మ అమ్మవారి సంబరాలు ముందు తరాలకు గుర్తుండిపోయేలా ఘనంగా నిర్వహిస్తున్నాం. అందుకు అనుగుణంగా ఈ ఏడాది ఘనంగా నిర్వహిస్తున్నాం. పంచాయతీ ప్రజల సహకారంతో రంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నాం. పంచాయతీ మొత్తం విద్యుత్ అలంకరణలతో పులులు, ఏనుగులు వివిధ రకాలతో కూడిన బొమ్మలను ఏర్పాటు చేశాం. పంచాయతీ ప్రజల సహకారం అద్భుతంగా ఉంది. ఈ సారి సంబరాలు తరతరాలుగా గుర్తుండిపోయేలా నిర్వహిస్తున్నాం. వలస దారులతో, బంధువులతో, చిన్నారులతో ఇంటింటా సందడిగా ఉంది.

- మర్ల హేమలత, శంకర్, సర్పంచ్, పాలవలస

ఆనవాయితీగా వస్తోంది



గ్రామ దేవత రౌతు పోలమ్మ తల్లి సంబరాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. వందేళ్ల నుంచి గ్రామ దేవత ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నాం. పంచాయతీ ప్రజలందరూ ఉమ్మడి నిర్వహించడం ఆనందంగా ఉంది. తాను సర్పంచ్ కాలంలో వైభవంగా నిర్వహించాం. గ్రామ దేవత పండగతో పంచాయతీలో సందడిగా ఉంది. యువకులు వివిధ సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహిళలు గ్రామ దేవత సాంప్రదాయాలను పాటిస్తున్నారు.

- దంగేటి భైరాగి, మాజీ సర్పంచ్, పాలవలస

ఆనందంగా ఉంది



గ్రామంలో అందరూ కలిసి చాలా ఏళ్ల తర్వాత రౌతు పోలమ్మ తల్లి సంబరాలు నిర్వహించడం ఆనందంగా ఉంది. ఇలా నిర్వహించడం వల్ల ప్రజల్లో ఐక్యత పెరుగుతుంది. అలాగే అభివృద్ధి అవకాశం ఉంటుంది. సంబరాలు తరువాత అందరూ కలిసి పంచాయతీ అభివృద్ధిపై ప్రణాళిక వేసుకుంటాం.

- డాక్టర్ కె.మాధవరావు చౌదరి, అధ్యక్షుడు, రాష్ట్ర విశ్వ ఆయుర్వేద పరిషత్

పెద్దల మార్గంలో వెళ్తున్నాం



గతంలో గ్రామ పెద్దలు చేపట్టిన గ్రామ దేవత సంబరాలను వారి బాటలోని ముందుకు తీసుకెళ్తున్నాం. సంబరాల్లో యువకులు, మహిళలు సహకరిస్తున్నారు. దూరం ప్రాంతాలకు వలస వెళ్లిన వారు కొద్ది రోజుల ముందే గ్రామానికి తరలివచ్చారు. దీంతో జనంతో పంచాయతీ కిటకిటలాడుతుంది.

- సంగారు లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్, పాలవలస



గ్రామస్తుల సహకారం మరువలేనిది

గ్రామంలో గ్రామ దేవత సంబరాలను నిర్వహిస్తామని చెప్పినప్పుడు గ్రామస్తులు అందించిన సహకారం చాలా విలువైనది. తాహతకు మించి అందరూ ఆర్థికసాయం అందించారు. సంబరాలు ఇంత ఘనంగా నిర్వహించడానికి గ్రామస్తుల సహకారమే కారణం.

- కాళ్ల బాలరాజు, సంబరాల నిర్వహణ కమిటీ కార్యదర్శి



సరదాగా సంబరాలు

పంచాయతీలోని ప్రజలందరూ సరదాగా సంబరాలు నిర్వహి స్తున్నారు. వైభవంగా గ్రామ దేవత ఉత్సవాలను నిర్వ హించడం ఆనవాయితీ. అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడం వల్ల అందరికీ మేలు మేలుచేకూరుతుందని నమ్మకం. యువత, మహిళలు, ప్రజలు సంబరాల నిర్వహణకు సహకారం అంది స్తున్నారు.

- చెల్లూరు జానకి ధర్మారావు, సంబరాల కమిటీ కోశాధికారి

అందరికీ ఆదర్శం



రౌతు పోలమ్మ తల్లి సంబరాలు యువత, ప్రజలకు ఆదర్శంగా నిలుస్తుంది. అందరూ కలిసిమెలిసి సంబరాలు నిర్వహించడంతో ప్రయోజనాలు తెలియజేస్తాయి.

- చెల్లూరి వరప్రసాద్, పాలవలస

బంధువులతో కళకళ



చదువులు, ఉద్యోగాల రీత్యా ఎక్కడెక్కడో వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులు, బంధువులంతా ఒకే చోట చేరారు. దీంతో కొద్ది రోజులైనా గడిపేందుకు ఈ సంబరాలు అవకాశాన్ని కల్పిస్తున్నాయి. ఇంటింటా బంధువులు, స్నేహితులతో కళకళలాడుతుంది.

- కోట్ని శ్రీనివాసరావు, పాలవలస

సంబరాల నిర్వహణ బాగుంది



ఇంత పెద్దఎత్తున అమ్మవారి సంబరాలు నిర్వహించే బాధ్యత తనకు లభించడం అదృష్టంగా భావిస్తున్నాను. ఎటువంటి లోటు పాట్లు లేకుండా సంబ రాలను నిర్వహించడం, అందరి సహకా రంతో సాధ్యమవుతుందని భావిస్తున్నా.

- దుమ్ము గోవింద్, సంబరాల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు

ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి



తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్న రౌతు పోలమ్మ తల్లి సంబరాలల్లో విద్యుత్ అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే ఈ వేసవి సెలవులు సంబరాల వల్ల పిల్లలకు ప్రత్యేకంగా గుర్తుండిపోతాయి. నా చిన్నతనంలో నిర్వహించిన సంబరాలు గుర్తుకొస్తున్నాయి. ఈ సంబరాలు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది.

- గోకర్ణ నారాయణరావు, రైల్వే ఉద్యోగి, పాలవలస

ఎంతోమందికి ఉపాధి

తొమ్మిది రోజుల పాటు గ్రామంలో నిర్వహిస్తున్న రౌతు పోలమ్మ తల్లి సంబరాలు ఎంతో మందికి ఉపాధిని కల్పించినట్లయ్యింది. బయట గ్రామాల నుంచి వచ్చేవారంతా గ్రామ అభివృద్ధికి దోహదపడటం ఆనందించాల్సిన విషయం.

- మర్ల రామస్వామి, పాలవలస



వైభవంగా రౌతు పోలమ్మ తల్లి సంబరాలు





















సమాజ సేవలో పిఎస్ఐ ట్రస్టు


ప్రజాశక్తి- సోంపేట

తనకు ఉన్నదాంట్లో ఎంతోకొంత ఇతరులకు సహాయం చేసే వాళ్లని చూస్తుంటాం. కానీ తోటి వారితో కలిసి సమాజంలోని నిరుపేదలకు అండగా నిలవాలన్న ఏకైక లక్ష్యంతో పాలవలసకు చెందిన గార బాబూరావు వ్యవస్థాపక అధ్యక్షుడిగా పీపుల్ సర్వీస్ ఆఫ్ ఇండియా పిఎస్ఐ పేరిట ట్రస్టును ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తు ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాడు. 2013 అక్టోబరు 20న తన తల్లి గార భానుమతి అధ్యక్షులుగా ప్రకటించి పిఎస్ఐ ట్రస్టును స్థాపించాడు. నిరుపేదలకు నిస్వార్థమైన సేవలను అందించాలని లక్ష్యంతో నవయజ్ఞాలు పేరిట కార్యక్రమాలను రూపొందించుకున్నాడు. తోడు, నీడ పేరిట నిరుపేద వృద్ధులకు, వికలాంగులకు, అనాథలకు సహాయ సహకారాలు అందించి వారికి ఉచితంగా వైద్య ఆరోగ్య సేవలను అందిస్తున్నారు. దీనికోసం ఉచిత అంబులెన్స్ సర్వీస్‌ను నడుపుతున్నారు. రక్తదాత ప్రాణదాత పేరిట ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ట్రస్టు తరపున రక్తాన్ని అందిస్తున్నారు. అన్నదాత సుఖీభవ పేరిట ఆకలితో ఉన్న నిరుపేదలకు అన్నదానం, నిత్యవసర సరుకులు అందించడం చేస్తున్నారు. విద్య వెలుగు కార్యక్రమం పేరిట నిరుపేద విద్యార్థులకు ఉచితంగా





పుస్తకాలను అందించడం, ఉదయం, సాయంత్రం వేళలో ట్యూషన్స్ చెప్పించడం చేస్తున్నారు. ఉన్నత విద్య చదువుతున్న నిరుపేదలకు సంస్థ తరఫున ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు. గ్రామాల్లో ట్రస్టు తరుపున క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తున్నారు. యువతరం పేరిట యువతకు ఉన్నత విద్య కోసం అవగాహన కల్పించడం చదువుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్స్‌ను అందించడం చేస్తున్నారు. క్రీడల్లో రాణిస్తున్న యువతకు ప్రోత్సాహకాలు అందిస్తూ... చేయూత ఇస్తున్నారు. రైతు నేస్తం ద్వారా నిరుపేద రైతులకు విత్తనాలను, ఎరువులను ఉచితంగా అందిస్తున్నారు. రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై ట్రస్టు ద్వారా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. జలరక్షిత కార్యక్రమాల ద్వారా వేసవి కాలంలో గ్రామంలోనూ, రహదారుల వెంట, ముఖ్య కూడళ్ల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల్లో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల సందర్భంగా ఉత్సవాల సందర్భంగా ప్రజలకు తాగునీటిని అందిస్తున్నారు. జీవ ప్రకృతి కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమా లను ట్రస్టు ఆధ్వర్యాన చేపడుతున్నారు. రహదారులకు ఇరువైపులా మైదాన ప్రాంతాల్లోనూ మొక్కలు నాటే కార్యక్రమాలను చేపడుతున్నారు. జంతువుల పరిరక్షణకు తోటలను, సామాజిక అడవులను రక్షించే కార్యక్రమాలు చేపడుతున్నారు. స్త్రీ సంక్షేమం పేరిట నిరుపేద గర్భిణులకు ఆరోగ్య వైద్య సేవలను అందజేస్తున్నారు. నిరుపేద మహిళలకు ప్రసూతి కోసం ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు స్త్రీ విద్యపై గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత ఉత్సవాల శుభాకాంక్షలు


శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత అమ్మవారి ఉత్సవాలకు విచ్చేసిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు భక్తులకు శుభాకాంక్షలు



గోకర్ల వెంకటేశ్వరరావు
Rtd. Technical Officer, NSTL
Visakhapatnam (DRDO)
పాలవలస గ్రామం, సోంపేట మండలం

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత ఉత్సవాల శుభాకాంక్షలు

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత అమ్మవారి ఉత్సవాలకు విచ్చేసిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు భక్తులకు శుభాకాంక్షలు



మర్ల లోకనాథం, RMP,
పాలవలస గ్రామం, సోంపేట మండలం

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత ఉత్సవాల శుభాకాంక్షలు

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత అమ్మవారి ఉత్సవాలకు విచ్చేసిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు భక్తులకు శుభాకాంక్షలు తెలుపుతూ...




పాందూరు దిలీప్ కుమార్, S/o అప్పారావు
పాలవలస, సోంపేట మండలం, సెల్ : 9849977685

గృహనిర్మాణానికి అవసరమైన లేబర్ కాస్ట్, మెటీరియల్ కాస్ట్‌తో కాంట్రాక్టర్ వర్క్స్ చేయబడును. అన్ని రకాల వర్క్స్ సరసమైన ధరలకే నాణ్యమైన క్వాలిటీ ఇవ్వబడును

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత ఉత్సవాల శుభాకాంక్షలు

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత అమ్మవారి ఉత్సవాలకు విచ్చేసిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు భక్తులకు శుభాకాంక్షలు తెలుపుతూ...



మర్ల రామారావు
శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు,
పాలవలస, సోంపేట మండలం

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత ఉత్సవాల శుభాకాంక్షలు

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత అమ్మవారి ఉత్సవాలకు విచ్చేసిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు భక్తులకు శుభాకాంక్షలు తెలుపుతూ...



గోకర్ల నారాయణరావు
E.Co. Railway Employee
పాలవలస, సోంపేట మండలం

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత ఉత్సవాల శుభాకాంక్షలు

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత అమ్మవారి ఉత్సవాలకు విచ్చేసిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు భక్తులకు శుభాకాంక్షలు

సాయి దుర్గ ఆర్ట్స్
ఎన్‌హెచ్-16 రోడ్, పాలవలస గ్రామం, సోంపేట మండలం

ప్రొ॥ విశ్వనాధం బ్రదర్స్

మా వద్ద :- అన్ని రకముల విగ్రహాలు తయారు చేయబడును

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత ఉత్సవాల శుభాకాంక్షలు

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత అమ్మవారి ఉత్సవాలకు విచ్చేసిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు భక్తులకు శుభాకాంక్షలు

చెల్లూరు దేవరాజు
ఇండియన్ రైల్వే

మర్ల రామ్మూర్తి
ఇండియన్ రైల్వే

నిమ్మాన సంతోష్
టీచర్

పాలవలస, సోంపేట మండలం

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత ఉత్సవాల శుభాకాంక్షలు

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత అమ్మవారి ఉత్సవాలకు విచ్చేసిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు భక్తులకు శుభాకాంక్షలు



మర్ల రామస్వామి
టిడిపి సీనియర్ నాయకులు
పాలవలస గ్రామం, సోంపేట మండలం

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత ఉత్సవాల శుభాకాంక్షలు

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత అమ్మవారి ఉత్సవాలకు విచ్చేసిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు భక్తులకు శుభాకాంక్షలు



భూతాడ అప్పన్న
పాలవలస గ్రామం, సోంపేట మండలం

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత ఉత్సవాల శుభాకాంక్షలు

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత అమ్మవారి ఉత్సవాలకు విచ్చేసిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు భక్తులకు శుభాకాంక్షలు తెలుపుతూ...



కోట్ని శ్రీనువాసరావు
వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకులు,
పాలవలస గ్రామం, సోంపేట మండలం

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత ఉత్సవాల శుభాకాంక్షలు

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత అమ్మవారి ఉత్సవాలకు విచ్చేసిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు భక్తులకు శుభాకాంక్షలు



చెల్లూరు వరప్రసాద్
Record Assistant



చెల్లూరు విశ్వనాధం
UCO Bank Manager - IT

పాలవలస గ్రామం, సోంపేట మండలం

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత ఉత్సవాల శుభాకాంక్షలు

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత అమ్మవారి ఉత్సవాలకు విచ్చేసిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు భక్తులకు శుభాకాంక్షలు తెలుపుతూ...



అన్నెపు షణ్ముఖరావు
RMP & గోపాలమిత్ర
పాలవలస, సోంపేట మండలం

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత ఉత్సవాల శుభాకాంక్షలు

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత అమ్మవారి ఉత్సవాలకు విచ్చేసిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు భక్తులకు శుభాకాంక్షలు తెలుపుతూ...

BACCHA ELECTRIC
ALL KINDS OF ELECTRICAL GOODS & ELECTRICAL CONTRACTOR
MD.RUSTAM, PROPRIETOR
CELL : 9903165173, GMAIL : mdrustam37924@gmail.com
JHAWBAGAN, URDIBAZAR, CHANDANNAGAR DIST, HOOGHLY, WEST BENGAL, PIN - 712 136

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత ఉత్సవాల శుభాకాంక్షలు

శ్రీశ్రీశ్రీ రౌతు పోలమ్మ తల్లి గ్రామ దేవత అమ్మవారి ఉత్సవాలకు విచ్చేసిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు భక్తులకు శుభాకాంక్షలు తెలుపుతూ...

శ్రీ సత్యనారాయణ లైటింగ్, సౌండింగ్, డి.జె., క్లాత్ డేకరేషన్ & సప్లయర్స్
A to Z సామాన్లు లభించును
పాలవలస గ్రామం, సోంపేట మండలం, శ్రీకాకుళం జిల్లా



ప్రొ॥ తామాడ సింహాచలం
తామాడ షణ్ముఖరావు
సెల్ : 8978248151, 9652992437

